గుంతల దారులతో అవస్థలు

- పూర్తిగా దెబ్బతిన్న లక్ష్మాపురం, పస్తాల బీటీ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



పస్తాల కల్వర్టు వద్ద కంకరతేలి దెబ్బతిన్న రోడ్డు



గుంతలమయంగా మారిన లక్ష్మాపురం రోడ్డు

నాగారం : మండల పరిధిలోని పస్తాల- లక్ష్మాపురం గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు పూర్తిగా దెబ్బతిని కంకర తేలి అస్తవ్యస్తంగా మారాయి. ఈ రోడ్డుపై ప్రయాణించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పస్తాల స్టేజీ నుంచి గుండెపురి వరకు, లక్ష్మాపురం, కాశీతండా, వెలుగుపల్లి వరకు బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. లక్ష్మాపురం నుంచి కాశీతండా, వెలుగుపల్లి, పస్తాల నుంచి గుండెపురి ప్రధాన రహదారి గుండా ప్రజలు నిత్యం వివిధ అవసరాలకు సూర్యాపేట, తిరుమలగిరి, తుంగతుర్తి, నాగారం తదితర గ్రామాలకు వెళ్తుంటారు. లక్ష్మాపురం-కాశీతండాల మధ్య బస్ సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు నిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోలలోనే ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. కానీ రోడ్డు పూర్తిగా కంకర తేలి, అడుగడుగునా గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

కల్వర్టు వద్ద నిత్యం ప్రమాదాలు..

మండల పరిధిలోని పస్తాల స్టేజీ నుంచి గ్రామానికి సమీపంలో ఉన్న కల్వర్టు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఈ కల్వర్టు మీదుగా చెరువు నీరు నిత్యం వెళ్తుండడంతో కల్వర్టు సీసీ దెబ్బతిని, పాకురుపట్టి జారుతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయాలపాలవుతున్నారు. అలాగే కల్వర్టుకు ఇరువైపుల ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతిని భారీగా కంకర తేలింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పస్తాల, గుండెపురి మధ్య నూతన రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



కాశీతండా నుంచి లక్ష్మాపురం, పస్తాల, గుండెపురి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకరతేలింది. ఈ రహదారి గుండా ప్రజలు సూర్యాపేట, తిరుమలగిరి, నాగారం, తుంగతుర్తికి వెళ్తుంటారు. కంకరతేలిన రహదారిపై రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. కాశీతండా నుంచి గుండెపురి వరకు నూతనంగా తారు రోడ్డు నిర్మించాలి.

– మల్లేపాక యాకయ్య

ఘనంగా చౌడమ్మ తల్లి జాతర



మంత్రిని సన్మానిస్తున్న యాదవులు



జాతరలో పాల్గొన్న భక్తులు

చివ్వెంల : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో సోమవారం శ్రీ చౌడమ్మ తల్లి జాతరను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. సుమారు 100 సంవత్సరాల చరిత్ర గల ఈ జాతరను ప్రతి రెండు సంవత్సరాలకు ఒకమారు యాదవులు వైభవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా బోనాలు వండుకుని గ్రామంలో ఊరేగింపుగా తీసుకువచ్చి, గుడి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు.

జాతరను సందర్శించిన మంత్రి జగదీశ్‌రెడ్డి..

మండల పరిధిలో చౌడమ్మ జాతరను సోమవారం మంత్రి జగదీశ్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, సర్పంచ్ జాల మానస జయరాం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూర్ (ఎస్) : కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు క్రమబద్ధీకరణ కోసం ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పుష్ప అన్నారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. జీఓ 58 ప్రకారం 125 గజాలలోపు నివాసం ఉంటే ప్రభుత్వం ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేస్తుందని, జీఓ 59 ప్రకారం 126 గజాల కంటే ఎక్కువ ఉంటే నిర్ణీత ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

కలెక్టరేట్ ఎదుట నిరసన

దురాజ్‌పల్లి : డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సన్నాహక సమావేశానికి కలెక్టర్, ఎస్పీలు హాజరుకాక పోవడాన్ని నిరసిస్తూ దళిత, సామాజిక సంఘాల నాయకులు సోమవారం సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు చిన్న శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ములకలపల్లి రాములు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హస్సేన్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, సామాజిక, దళిత సంఘాల నాయకులు ఎర్ర వీరస్వామి, బొల్లెద్దు వినయ్, వెంకన్న, దయానంద్, దేవయ్య, గాజుల నర్సయ్య, బచ్చల కూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు నష్టం పరిశీలన

మద్దిరాల : మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం వచ్చిన అకాల వర్షాలు ప్రజలకు అపార నష్టాన్ని కలిగించాయి. కుంటపల్లి, కుక్కడం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారి వికాస్ పాటిల్ సోమవారం పరిశీలించారు. ధ్వంసమైన ఇళ్లకు మండల రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించి రిపోర్టులను పైఅధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ పొన్నం వెంకన్న, మంజ్యా, రాజు, ఏఈఓ అనూష పాల్గొన్నారు.

ప్లేట్లు బహూకరణ

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన గుడెపూరి వెంకటేశ్వర్లు కుమార్తె గుడెపూరి భవాని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా గుడెపూరి వెంకటేశ్వర్లు తన కుమార్తె జ్ఞాపకార్థం సోమవారం నాగారం జెడ్పీహెచ్‌ఎస్‌లో 60 మంది విద్యార్థులకు, సిబ్బందికి ప్లేట్లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ చిప్పలపల్లి మల్లేష్, ఉపాధ్యాయులు సిద్ధిరంగాచారి, శ్యాంసుందర్‌రెడ్డి, అఫ్జల్, రామలింగేశ్వర్‌రావు, రఘు, నవీన్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పని భద్రత కల్పించాలి

తుంగతుర్తి : అసంఘటిత కార్మికులకు పని భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలో జరిగిన ఏఐటీయూసీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక రంగ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బొంకూరి శ్యాంసుందర్, గుగులోతు రాజారాం, రామస్వామి, పున్నయ్య, హుస్సేన్, లింగమల్లు రమేష్, సోమయ్య పాల్గొన్నారు.

అనాథ బాలికను ఆదుకోవాలని వినతి

దురాజ్‌పల్లి : తల్లిదండ్రులను కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతున్న మునగాలకు చెందిన అనాథ బాలిక రాజమ్మను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కన్వీనర్ కొత్తపల్లి శివకుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అనాథ బాలికతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలిక కిడ్నీ సమస్యతో బాధపడుతుందని, వైద్యం చేయించే స్థోమత నిరుపేద కుటుంబానికి లేదని తెలిపారు. కార్యక్రమంలో ఏసోబు, సావిత్రి, రాజమ్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మద్దిరాల : బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన ఘటనలో మండల పరిధిలోని రెడ్డిగూడెం శివారులో 365వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల పరిధిలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన కసనబోయిన వెంకన్న మద్దిరాల మండల కేంద్రంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడికి వచ్చిన తన మేనత్త తీగల హైమాను రెడ్డిగూడెం గ్రామంలో దింపి రావడానికి బైక్‌పై వెళ్తుండగా రెడ్డిగూడెం శివారులో 365వ నంబర్ జాతీయ రహదారిపై ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకన్న రెండు కాళ్లు విరగగా, హైమా తలకు బలమైన గాయం అయ్యింది. ఇరువురిని స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుక్క దాడిలో వృద్ధురాలుకు..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో కొద్ది రోజులుగా కుక్కలు స్వైర విహారం చేస్తూ కనిపించిన వారిని కరిచి గాయపరుస్తున్నాయి. ఇటీవల కుక్కల దాడిలో పలువురు గ్రామస్తులు గాయపడ్డారు. తాజాగా సోమవారం రింగు బక్కమ్మ అనే వృద్ధురాలు ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా ఓ వీధి కుక్క వెంటపడి కాలుకు కరిచి గాయపరిచింది.

ధర్మభిక్షం చౌరస్తాగా ప్రకటించడంపై హర్షం

దురాజ్‌పల్లి : స్వతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం గుర్తుగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహం ఏరియాను ధర్మ భిక్షం చౌరస్తాగా ప్రకటించడం హర్షణీయమని గీత పనివారల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవనంలో ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ధర్మభిక్షం విగ్రహం వద్ద ముఖద్వారం ఏర్పాటు చేస్తూ ఆ చౌరస్తాకు ధర్మభిక్షం పేరును ప్రకటించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ దోరేపల్లి శంకర్, బూర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లవి కుమ్మక్కు రాజకీయాలు



పాదయాత్ర చేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : దేశంలో, రాష్ట్రంలో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని, రెండు పార్టీలకు ప్రజలు చెక్ పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చిన చరిత్ర సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమైనప్పటికీ నేటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. పాదయాత్ర పూర్తయ్యాక తమ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమిస్తామని తెలిపారు. ప్రజా ధనాన్ని రాష్ట్రంలో బీఆర్‌ఎస్ దోచుకుంటుంటే దేశంలో బీజేపీ దోచుకుంటుందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేయడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ముదిరెడ్డి రమణారెడ్డి, నాయకులు గట్టు శ్రీనివాస్, ధరావత్ వెంకన్న నాయక్, స్వామి నాయుడు, ఫారుక్, కుప్పిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కుమ్మరికుంట్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో అధికంగా పోషకాలు



తిరుమలగిరి: మాట్లాడుతున్న సర్పంచ్ కరుణాకర్

నాగారం : చిరు ధాన్యాల్లో అధికంగా పోషకాలు ఉంటాయని సర్పంచ్ గట్టు నర్సింహారావు అన్నారు. సోమవారం ఫణిగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనత అధిగమించేందుకు చిరుధాన్యాలు, ఆకు కూరలు, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పోషకలోపాలు లేకుండా చిన్నారుల ఆరోగ్యంపై తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది చిరుధాన్యాలు, ఆకుకూరలతో తయారు చేసిన పోషక పదార్థాలను ప్రదర్శించి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ టీచర్లు వై.వసంత, కె.కవిత, పి.రజిత, జె.కవిత, సీహెచ్ చందన, జె. కళమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తిరుమలగిరి : చిరు ధాన్యాల్లో పోషకాలు అధికంగా ఉంటాయని, వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని మామిడాల సర్పంచ్ బి.కరుణాకర్ అన్నారు. సోమవారం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధూకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖైరున్నిసా, ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మం, ఉపాధ్యాయుడు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికారంతోనే ఆరోగ్యం

మద్దిరాల : పౌష్టికారంతోనే మనం ఆరోగ్యంగా ఉంటామని సర్పంచ్ గుండ్ల కొమురయ్య అన్నారు. సోమవారం కుక్కడంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హైమావతి, శ్రీవాణి, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల పరిరక్షణ చట్టం ఏర్పాటు చేయాలి



సంతాపం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

చివ్వెంల : దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యుడు గొంద్రాల అశోక్ కోరారు. ఢిల్లీలో దారుణహత్యకు గురైన న్యాయవాది నర్వాల్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పోలెబోయిన నర్సయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు కంచర్ల సతీష్‌కుమార్, జాయింట్ సెక్రటరీ రాంపాక ఉప్పలయ్య, లైబ్రేరియన్ కార్యదర్శి కొణం రఘురామయ్య, కోశాధికారి రాచకొండ యాదగిరి, గేమ్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి కోక రంజిత్ కుమార్, ఈసీ సభ్యులు మామిడి మట్టయ్య, పత్తిపాక రాధాక్రిష్ణ, పోలోజు మధు, తండు సైదులు గౌడ్, సుంకరి రవి కుమార్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ చేపట్టాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

దురాజ్‌పల్లి : మునగాల మండలం ఆకుపాములలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి మాట్లాడారు. వ్యవసాయ భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వాహనాలు ఉన్న వారికి రెండు ఇళ్లు వచ్చాయని ఆరోపించారు. స్థానిక వీఆర్‌ఓ తప్పిదం వల్ల అర్హులు నష్టపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు సురగాని సైదులు, పోలంపల్లి అశోక్ గౌడ్, బాధితులు కేసగాని కనకమ్మ, పోలంపల్లి గురవమ్మ, రచూరి శివలీల, పోలంపల్లి జానమ్మ, బాలేబోయిన సరిత, దొంతగాని రాములమ్మ, లిక్కి గురవమ్మ, తాళ్లపాక ఉష, తాళ్లపాక అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న స్థల దాత

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం రాఘవపురంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులకు సోమవారం సర్పంచ్ ధరావత్ మహేష్, స్థల దాత సత్యనారాయణరెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేష్ మాట్లాడారు. రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి 3 గుంటల స్థలాన్ని కేతిరెడ్డి సౌందర్య, రాఘవరెడ్డి స్మారకార్థం వారి కుమారుడు సత్యనారాయణరెడ్డి విరాళంగా ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రంగమ్మ, పంచాయతీరాజ్ ఏఈ రవికుమార్, కార్యదర్శి సరళ, మాజీ సర్పంచ్‌లు వీరోఖరయ్య, దొంగరి సోమయ్య, రవి, రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహాసభ కరపత్రాల ఆవిష్కరణ

తిరుమలగిరి : ఈ నెల 9న సూర్యాపేటలో జరిగే ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ 11వ మహాసభను విజయవంతం చేయాలని సోమవారం తిరుమలగిరిలో ఆ సంఘం నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, ప్రధాన కార్యదర్శి రాజేందర్, రహెమతుల్లా, చంద్రయ్య, లక్ష్మణ్, రాజబాబు, బాలచంద్రన్‌గౌడ్, రమేష్, శ్రీనివాస్, సుందర్, సోమనారాయణ, నాగరాజు, చంద్రారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళులు



సూర్యాపేట రూరల్ : కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు



తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయంలో..



తుంగతుర్తి : రావులపల్లిలో..

తిరుమలగిరి : దొడ్డి కొమురయ్య జయంతిని సోమవారం తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయంలో, మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, కమిషనర్ దండు శ్రీనివాస్, కౌన్సిలర్లు నరేష్, మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి మారయ్య, సిబ్బంది శిల్పిక తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ జీడి భిక్షం, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్ నాయుడులు కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : తెలంగాణ సాయుధ పోరాటంలో అమరుడైన దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని తహసీల్దార్ ఎండీ. జమీరుద్దీన్, ఎంపీడీఓ ఇందిర కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కొమురయ్య జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కొమురయ్య ఆశయసాధనకు కృషి చేయాలి

తుంగతుర్తి : దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు శ్రీకాంత్‌రాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలో దొడ్డి కొమురయ్య జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కన్నెబోయిన సుధాకర్, సురేష్, జయపాల్, నాగరాజు, చిన్నక్రిష్ణ, మల్లయ్య, నర్సయ్య, గణేష్ మురళీ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ శ్రీనివాస్, పీఆర్‌ఏఈ గోపి, డిప్యూటీ తహసీల్దార్ పద్మ, ఎంఈఓ నకిరేకంటి రవి, ఏపీఎం అజయ్, ఏపీఓ రవి, ఇన్‌చార్జ్ ఎంపీఓ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగారం : తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 96వ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గాలి శోభారాణి, ఎస్సారెస్పీ డీఈఈ పిచ్చయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చందన, డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఏపీఎం ఆనంద్, సినియర్ అసిస్టెంట్ ఉప్పలయ్య, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.



పెన్‌పహాడ్‌లో..



నాగారంలో..



నూతనకల్‌లో..

పదవ తరగతి పరీక్షలు ప్రారంభం



ఆత్మకూరులోని పరీక్ష కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

సూర్యాపేట రూరల్ : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని మొత్తం 180మందికి 180మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి శైలజ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు తనిఖీ చేశారు.

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు జి.తిర్మలగిరి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలకు మొదటి రోజు 409 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండు కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్స్ తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరు, మౌలిక వసతులను పరిశీలించారు. మండల కేంద్రంలోని సెంటర్‌ను తహసీల్దార్ రంగారావు పరిశీలించారు.

అర్వపల్లి : అర్వపల్లిలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండలానికి చెందిన 344 మంది విద్యార్థిని, విద్యార్థులు స్థానిక జెడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీ కేంద్రాల్లో పరీక్షలు రాశారు. ఈ పరీక్ష కేంద్రాలను ఎంఈఓ బి. బాలునాయక్, ఏఎస్‌ఐ కె. కృష్ణమూర్తి సందర్శించారు. వారి వెంట సీఎస్‌లు, డీఓలు ఎస్. వెంకన్న, రాములు, నారాయణ, వెంకటి, సిబ్బంది ఉన్నారు.

పెన్‌పహాడ్ : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఎంఈఓ నకిరేకంటి రవి తెలిపారు. మండలంలో మొత్తం 289మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ పరిశీలించారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, వీటి పరిధిలో 696 మందికి 695 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

తిరుమలగిరి : పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తిరుమలగిరిలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో 638 మంది విద్యార్థులకు గాను ఒక్కరు గైర్హాజరయ్యారని మండల విద్యాధికారి ఐ.శాంతయ్య తెలిపారు.

నూతనకల్ : పదో తరగతి పబ్లిక్ వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. నూతనకల్, మద్దిరాల మండలాల పరిధిలోని విద్యార్థులకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విజయమేరీ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200మంది విద్యార్థులకు ఒక్కరు, విజయమేరీ ఉన్నత పాఠశాలలో 206మంది విద్యార్థులకు ఒక్కరు గైర్హాజరైనట్లు ఎంఈఓ రాములునాయక్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ రాంబాబు, మద్దిరాల తహసీల్దార్ అమిన్‌సింగ్ తనిఖీ చేశారు.

ఆత్మకూర్ (ఎస్) : పదవ తరగతి పరీక్షలు సోమవారం మండల వ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఉండగా ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో 169 విద్యార్థులకు గాను ఒక్కరు గైర్హాజరయ్యారు. మోడల్ స్కూల్‌లో 98 మంది, నెమ్మికల్లులో 124 మంది, ఏపూరులో 69మంది పరీక్షకు హాజరయ్యారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి

నూతనకల్ : మండల కేంద్రంలో ఈ నెల 7న నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆత్మీయ సమ్మేళనం ఇన్‌చార్జ్ తాడూరి లింగయ్య కోరారు. సోమవారం ఎర్రపహాడ్ గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గాడ్దుల రజితలింగరాజు, పసుల రవి, లింగాల రాములు, కనకటి మహేష్, రాజు పాల్గొన్నారు.

రేపు నాగారంలో ఆత్మీయ సమ్మేళనం

నాగారం : మండల కేంద్రంలో ఈ నెల 5న జరిగే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి స్థానిక ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని అంబయ్యగౌడ్, ఎర్ర యాదగిరి, దోమల బాలమల్లు, గుంటకండ్ల ముకుందారెడ్డి, కూరం వెంకన్న, ఈదుల కిరణ్, కన్నెబోయిన మల్లేష్, పాదిల రమేష్, యారాల రాంరెడ్డి, బోయిని లింగమల్లు, తీగుళ్ల ప్రశాంత్, చిల్లర చంద్రమౌళి, అంజయ్య, వడ్డే పరశురాములు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మద్దిరాల : మండల కేంద్రంలో ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.15లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు పనులను సర్పంచ్ షేక్ ఇంతియాజ్‌ఖాతూన్ రజాక్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ మల్యాల నర్సయ్య, వడ్డాణం మధుసూదన్, యల్లు శివారెడ్డి, కొలగాని వెంకన్న, నాగరాజు, మైబూబా, రవి, శ్రీనివాస్, సురేష్, రాములు, నాగేష్, సతీష్, విజయ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వర్గీకరణపై మాట్లాడాలని వినతి

దురాజ్‌పల్లి : ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతపై బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఈ విషయమై క్షేత్రస్థాయి నేతలు కేంద్రస్థాయి బీజేపీ నేతలతో మాట్లాడాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావును ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న, జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్న, సీనియర్ నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు, ఎర్ర వీరస్వామి, గారా కనకయ్య, దాసరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి కొరత లేకుండా చూడాలి

తుంగతుర్తి : వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి నీటి కొరత లేకుండా చూడాలన్నారు. ఉత్తమ జీపీలుగా ఎన్నికైన సూర్య తండా, సింగారం తండాల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ప్రశంసపత్రాలు అందజేసి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భీంసింగ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల తేదీలను ప్రకటించడం సరికాదు

సూర్యాపేటటౌన్ : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి కారణమైన బోర్డు చైర్మన్‌ను తొలగించకుండా, బోర్డు ప్రక్షాళన చేయకుండా మళ్లీ పరీక్షల తేదీలను ప్రకటించడం సరైంది కాదని పీడీఎస్‌యూ నాయకులు, నిరుద్యోగులు డిమాండ్ చేశారు. లీకేజీకి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ నాయకులు, నిరుద్యోగులు పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో, సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, నాయకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాలి

తిరుమలగిరి : తుంగతుర్తి నియోజకవర్గంలో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాలని సామాజిక ఉద్యమకారుడు పులిగిల్ల ప్రియాంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాషబోయిన వేణురాజ్ కోరారు. సోమవారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధిలో ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రుద్రమదేవి చెరువు, వెంపటి చెరువులను రిజర్వాయర్ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదని అన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరికి కూడా డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందలేదని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అంబేద్కర్, గణేష్, వెంకన్న పాల్గొన్నారు.